# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 06 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సైనిక సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి లక్ష విరాళం

### పతాక దినోత్సవ నిధికి చెక్ అందజేత

**బలగం టీవీ, హైదరాబాద్**




సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1 లక్ష రూపాయల విరాళం అందించారు. సాయుధ దళాల పతాక దినోత్సవం (డిసెంబర్ 7) పురస్కరించుకుని తెలంగాణ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టరేట్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోల్డ్ అండ్ బ్రేవ్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, కెప్టెన్ శ్రీనేష్ కుమార్, కెప్టెన్ నరోత్తమ్ రెడ్డి, కెప్టెన్ శ్రీనివాసులు తో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

### ద్వైపాక్షిక సంబంధాల

## బలోపేతానికి కట్టుబడి ఉన్నాం

- ఇంధన రంగంలో బలమైన భాగస్వామ్యం
- వాణిజ్య చెల్లింపులకు ఇరుదేశాల కరెన్సీ
- రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టీకరణ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్-రష్యా సంబంధాలకు చారిత్రక ప్రాధాన్యం ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక అంతర్జాతీయ సమస్యలపై మోదీతో విశ్లేషణాత్మక చర్చలు జరిగాయని తెలిపారు.

పెరుగుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు అంతరాయం లేకుండా నిరంతరాయ ఇంధన సరఫరా చేస్తామని పుతిన్ హామీ ఇచ్చారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఆయిల్, గ్యాస్, బొగ్గు వంటి కీలక ఎనర్జీ వనరులను భారత్‌కు సరఫరా చేయడానికి రష్యా సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అవసరమైన ప్రతీ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

**ఇంధన రంగంలో బలమైన భాగస్వామ్యం**

భారత్-రష్యా మధ్య ఇంధన రంగంలో ఇప్పటికే విజయవంతమైన భాగస్వామ్యం ఉందని పుతిన్ తెలిపారు. భారత ఇంధన రంగ అభివృద్ధికి అవసరమైన అన్ని వనరులను అందించేందుకు రష్యా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.భారతదేశంలో నిర్మాణం జరుగుతున్న అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రం పనులు వేగంగా సాగుతున్నాయని, ఆరు రియాక్టర్లలో మూడింటిని ఇప్పటికే దేశ ఇంధన నెట్‌వర్క్‌కు అనుసంధానించామని తెలిపారు. ద్వైపాక్షిక చెల్లింపుల విషయంలో భారత్, రష్యా జాతీయ కరెన్సీలకు ప్రాధాన్యం పెంచుతున్నాయి. ప్రస్తుతం వాణిజ్య లావాదేవీల్లో దీని వాటా 96 శాతంకి చేరిందని పుతిన్ వెల్లడించారు.

ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత దృఢపరచడానికి రష్యా కట్టుబడి ఉందని పుతిన్ తెలిపారు. భారత్%-%రష్యా మధ్య వాణిజ్యం ప్రస్తుతం 64 బిలియన్ డాలర్లు ఉండగా, దానిని 100 బిలియన్ డాలర్లకు పెంచాలనే లక్ష్యంతో ఇరుదేశాలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఉమ్మడి ప్రాజెక్టుల అమలులో వేగం పెంచేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయని పేర్కొన్నారు. చమురు, సహజవాయువు, బొగ్గు సరఫరాపై కీలక ఒప్పందాలు కుదిరాయని తెలిపారు.

**రవాణా, వైద్య, వ్యవసాయ రంగాల్లో భాగస్వామ్యం**

ద్వైపాక్షిక రవాణా అనుసంధానాన్ని పెంచేందుకు అంతర్జాతీయ ఉత్తర%-%దక్షిణ రవాణా కారిడార్ ఏర్పాటుకు ఇరుదేశాలు ముందుకు సాగుతున్నాయని పుతిన్ వెల్లడించారు. వైద్య, వ్యవసాయ రంగాల్లో సాంకేతిక మార్పిడి, సంయుక్త పరిశోధన వంటి అంశాల్లో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపన, ఆధునిక యంత్రాల తయారీలో కూడా రష్యా సహకారం అందిస్తుందని చెప్పారు.

**రష్యాలో భారతీయ సంస్కృతికి ప్రోత్సాహం**

రష్యాలో భారతీయ భాషల చిత్రాలు, సంస్కృతి ప్రచారానికి పూర్తి స్థాయి మద్దతు అందిస్తామని పుతిన్ వెల్లడించారు. అణు విద్యుత్ సహా పలు కీలక రంగాల్లో కొత్త ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ, వాణిజ్య సహకారం మరింత బలపడుతోందని పుతిన్ అన్నారు.

## అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా

- ఎవరితోనైనా కొట్లాడుతా.. ఢిల్లీనైనా ఢీ కొడుతా
- నిధులు తీసుకొస్తా.
- ప్రపంచానికి పోరాట పంథాను చాటిచెప్పిన వరంగల్ గడ్డ
- సమ్మక్క- సారలమ్మ మందిరం అద్భుతంగా నిర్మాణవుతోంది
- మార్చి 31లోపు వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్
- వరంగల్‌ను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేసే ప్రణాళిక
- నర్సంపేటలో ప్రజాపాలన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**బలగం టీవి, వరంగల్**

"తెలంగాణ అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా. ఎవరితోనైనా కొట్లాడుతా.. ఢిల్లీనైనా ఢీ కొడుతా! నిధులు తీసుకొస్తా. అడగాడనికి వెనుకాడను. రాకపోతే కొట్లాడటానికి అసలే భయపడను. రాష్ట్రానికి కావలసిన నిధులు, రావలసిన అనుమతుల కోసం ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి అడగడం ముఖ్యమంత్రిగా నా బాధ్యత. ఒకటికి వంద సార్లు తిరుగుతా. నాకు ఓపిక ఉంది. వయసుంది. విషయాన్ని వివరించే కనీస పరిజ్ఞానం నాకుంది. మీ ఆశీర్వాదం ఇలాగే ఉండాలి.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి అన్నారు కాకతీయ కాలం నుంచి ప్రపంచానికి పోరాట పంథాను చాటిచెప్పిన వరంగల్ గడ్డ, సమ్మక్క- సారలమ్మ, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, కృష్ణమాచార్యులు, కాళోజీ నారాయణ రావు, పీవీ నర్సింహరావు గారి నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొ జయశంకర్ గార్లు ప్రజా ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలుస్తారు. వారి స్ఫూర్తిగానే ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.

ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ. 532.24 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు.

'నిరుపేదలు, దళిత, గిరిజన, ఆదివాసీ, మైనారిటీ పిల్లలు చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుంది. అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన చదువులు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. తాతముత్తాల కాలం పది తరాలుగా వృత్తులు చేసుకుంటూ వచ్చినా బతుకులు మారలేదు. చదువొక్కటే మన బతుకుల్లో మార్పు తీసుకొస్తుంది. నిలబెడుతుంది. ప్రపంచంతో పోటీ పడేలా చేస్తుంది.ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అనేక సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకుని.. ఒకవైపు రైతులు, మరోవైపు మహిళలు, ఇంకోవైపు యువత కోసం కార్యక్రమాలు చేపట్టింది. యువత కోసం ఉద్యోగ నియామకాలు చేపట్టాం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది లోపే 61 వేల ఉద్యోగాలిచ్చాం. ఇంకా 40 వేల ఉద్యోగాలిచ్చే ప్రక్రియ మొదలవుతుంది. అభివృద్ధి పథంలో సాగాలంటే ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యునికేషన్ అత్యంత కీలకమని, ఆయా రంగాల్లో లక్ష్యాలను సాధించడానికి ఈ నెల 8, 9, తేదీల్లో ప్రపంచ స్థాయిలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నాం.

హైదరాబాద్‌తో సమంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. పక్క రాష్ట్రాల్లో నాలుగైదు విమానాశ్రయాలుంటే, తెలంగాణలో ఒక్కటి మాత్రమే ఉంది. పదేండ్లలో వీటి గురించి పట్టించుకోలేదు. కనీసం రోడ్లు వేయలేదు. డిసెంబర్ ఆఖరునాటికి భూ సేకరణ పూర్తి చేసి మార్చి 31 లోపు వరంగల్ విమానాశ్రయ పనులు ప్రారంభిస్తాం. హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్ పోర్టు పూర్తి చేస్తాం. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన సమ్మక్క- సారలమ్మ మందిరం అద్భుతంగా నిర్మాణవుతోందని, అదే తరహాలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

రాష్ట్రంలో ప్రతి మారుమూల తండాకు రోడ్డు కనెక్టివిటీ ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో ఏ గ్రామానికి రోడ్డు లేదన్న మాట వినదలచుకోలేదని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 20 వేల కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నాం. ప్రతి గూడెం నుంచి మండల కేంద్రానికి, ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసలు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు వేస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో మహిళాభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. ఉచిత బస్సు సౌకర్యం, సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఉత్పత్తుల విక్రయానికి శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్, బస్సులకు యజమానులుగా.. ఇలా అనేక మిగితా 4వ పేజీలో

### 2030 ఆర్థిక సహకార కార్యాచరణకు

## భారత్-రష్యా అంగీకారం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్-రష్యాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచే లక్ష్యంతో 2030 ఆర్థిక సహకార కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఇరుదేశాలు అంగీకరించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పర్యటన సందర్భంగా మోదీ-పుతిన్ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఇరుదేశాలు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు జరిపాయి.ప్రాధాన్య రంగాలను గుర్తించి, దీర్ఘకాలిక ఆర్థిక సంబంధాల వృద్ధికి ఈ రోడ్‌మ్యాప్ దోహదం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వాణిజ్యాన్ని పెంచేందుకు తక్షణమే లిలిస్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ను ఖరారు చేయాలనే అంశంపై కూడా ఇరుపక్షాలు చర్చించాయి. వలసలు, మొబిలిటీ, వైద్యం, ఆహార భద్రత, ఓడరేవులు, షిప్పింగ్ రంగాల్లో పరస్పర సహకారానికి సంబంధించిన ఒప్పందాలకు రెండు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు.

**8 దశాబ్దాల స్నేహం ధ్రువనక్షత్రంలా స్థిరం: మోదీ**

భారత్-రష్యా మైత్రి ఎనిమిది దశాబ్దాలకుపైగా ధృవనక్షత్రంలా నిలిచిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పరస్పర గౌరవం, లోతైన విశ్వాసంతో ఈ సంబంధాలు కాలపరీక్షను ఎదుర్కొని మరింత బలోపేతం అవుతున్నాయని చెప్పారు. భారత్-రష్యా బిజినెస్ ఫోరంలో భారతం సక్రియంగా పాల్గొంటోందని, ఇది రెండు దేశాల పరిశ్రమల్లో సహ-ఉత్పత్తి, సహ-నవీనతను వేగవంతం చేస్తుందని తెలిపారు. ఓడల నిర్మాణంలో ఇరుదేశాల సహకారం మేక్ ఇన్ ఇండియాకు తోడ్పడుతోందని పేర్కొన్నారు.

**ఇంధన భద్రత భాగస్వామ్యానికి ప్రధాన స్తంభం: పుతిన్**

భారత్-రష్యా భాగస్వామ్యంలో ఇంధన భద్రత ప్రధాన స్తంభమని రష్యా అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. పౌర అణుశక్తి రంగంలో ఇరుదేశాల దశాబ్దాల నాటి సహకారం, స్వచ్ఛ ఇంధన లక్ష్యాల సాధనకు దోహదం చేస్తుందని చెప్పారు. అరుదైన ఖనిజాల రంగంలో ఇరుపక్షాల భాగస్వామ్యం, ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన సరఫరా గొలుసులను ఏర్పరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. "గత ఎనిమిది దశాబ్దాలలో ప్రపంచం అనేక మార్పులు చూసినప్పటికీ భారత్%-%రష్యా స్నేహం స్థిరంగా నిలిచింది. మా విన్%-%విన్ సహకారం భవిష్యత్ తరాలకు మార్గదర్శి అవుతుంది" అని మిగితా 4వ పేజీలో

### బీఆర్ఎస్ పాలనలో

## స్వయం సమృద్ధి కేంద్రాలుగా గ్రామాలు



- మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కేసీఆర్ దత్తత గ్రామాలు ఏకగ్రీవం
- కేసీఆర్‌ను కలిసిన ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచులు.. వార్డు మెంబర్లు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో నూతన తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలన్నీ స్వయం సమృద్ధి చెంది స్వయం పాలిత కేంద్రాలుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలుగా వర్ధిల్లాయని, దళిత, గిరిజన, బహుజన మహిళా వర్గాలకు కుల వృత్తులకు, గ్రామీణాభివృద్ధికి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, అమలుచేసిన పథకాలు, పల్లె ప్రగతికి అందించిన ఆర్థిక సహకారం, తెలంగాణ పంచాయితీరాజ్ వ్యవస్థ బలోపేతానికి తోడ్పాటును అందించాయని, తాను దార్శనికతతో సీఎంగా చేపట్టిన పాలనా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు.తెలంగాణ ముఖ్యమంత్రిగా తాను దత్తత తీసుకున్న గజ్వేల్ నియోజక వర్గ పరిధిలోని, ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచులు.. వార్డు మెంబర్లు శుక్రవారం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.వారిని తన నివాసానికి సాదరంగా ఆహ్వానించి, గ్రామస్థుల సమష్టి మద్దతుతో ఎన్నికైన సర్పంచులను వారిని కేసీఆర్ గారు శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంచారు.

ఈ సందర్భంగా తన వద్దకు వచ్చిన గ్రామస్థులను, గుర్తుపట్టి, పేరు పేరునా పలకరించి, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వాతావరణం, మౌలిక వసతుల అందుబాటు, పండుతున్న పంటల పరిస్థితి గురించి పేరు పేరునా అడిగి కేసీఆర్ గారు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా.. తెలంగాణలో గత బీఆర్ఎస్ పాలనలో గొప్పగా వర్ధిల్లిన గ్రామాల పరిస్థితిని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రకాలుగా దిగజారిన పరిస్థితిని, గ్రామస్థులు కేసీఆర్ గారి దృష్టికి తెచ్చి ఆవేదన వ్యక్తం చేశారు.నాడు విద్యుత్, సాగునీరు సహా వ్యవసాయాభివృద్ధికి సీఎంగా కేసీఆర్ గారు అందించిన మిగితా 4వ పేజీలో

## ఏసీబీకి రెడ్ హ్యాండె డ్‌గా చిక్కిన హనుమకొండ అదనపు కలెక్టర్..


**బలగం టీవీ, హనుమకొండ**



హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇంచార్జి విద్యాశాఖ అధికారి వెంకట్ రెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండె డ్‌గా పట్టుబడ్డాడు. కలెక్టరేట్ కార్యాలయంలోనే ఆయన రూ.60,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ లంచం విద్యాశాఖకు సంబంధించిన వ్యవహారానికి గాను తీసుకున్నట్లు సమాచారం. అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డితో పాటు, ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ఉద్యోగిని కూడా ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

## వడ్డీ రేట్లు మరో పావు శాతం తగ్గింపు

- ఆర్బీఐ




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆర్బీఐ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరోమారు వడ్డీ రేట్లకు కోత పెట్టింది. రెపోరేటును పావు శాతం తగ్గించి 5.25 శాతానికి పరిమితం చేసింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయాలను ఆయన శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ కాలంలో మూడు సార్లు వడ్డీ రేట్లను 100 బేసిస్ పాయింట్లు తగ్గించామని గుర్తు చేశారు. నాలుగోసారి కూడా 25 బేసిస్ పాయింట్లు తగ్గించామని చెప్పారు. దీంతో

ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ఈ క్రమంలో గృహ, వాహన, రిటైల్, వ్యక్తిగత రుణాలపై భారం తగ్గుతోంది. రూపాయి పతనం కొనసాగుతున్నప్పటికీ.. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి పడిపోవడంతో వృద్ధి రేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టామని మల్హోత్రా అన్నారు. బాహ్య వాతావరణం ప్రతికూల సవాళ్లతో కూడుకున్నప్పటికీ భారతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగైన ప్రగతిని ప్రదర్శించిందన్నారు. తగ్గిన ద్రవ్యోల్బణం మరింత వృద్ధికి మద్దతుగా నిలవడానికి వీలు కల్పించనుందని పేర్కొన్నారు. "జీఎస్టీ శ్లాబుల తగ్గింపునతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 8.2శాతం వృద్ధి నమోదయ్యింది. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ జీడీపీ అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నాం. ధరలు కూడా తగ్గుముఖం పట్టినందున 2025-26కు గాను ద్రవ్యోల్బణం అంచనాలను 2.6 శాతం నుంచి 2 శాతానికి అంచనా వేస్తున్నాము. విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఇవి సరిపోతాయి." అని మల్హోత్రా తెలిపారు. ఆర్బీఐ వడ్డీ రేట్ల కోత వార్తలతో స్టాక్ మార్కెట్లు సానుకూలంగా ట్రేడింగ్ అయ్యాయి. వారాంతం సెషన్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 447 పాయింట్ల లాభంతో 85,712కు చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 153 పాయింట్లు పెరిగి 26,186 వద్ద ముగిసింది.

## 1 ట్రిలియన్ లక్ష్యానికి సమ్మిట్ కీలకం

- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కీలక భూమిక పోషిస్తుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర పురోగతికి దోహదపడటానికి చేస్తున్న అన్ని ప్రయత్నాల్లో విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నందుకు ముఖ్యమంత్రి కి అభినందనలు తెలిపారు. సదస్సు విజయవంతం కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక, ప్రాముఖ్యమైన ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలసిన వారికి ఈ సదస్సు ఒక వేదికగా దోహదపడుతుందని సోనియా గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పంపిన సందేశంలో పేర్కొన్నారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ-వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇస్తూ మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని ఆ లేఖలో ప్రస్తావించారు. తెలంగాణలోని మానవ వనరులు, సహజ వనరులు, ప్రజల వ్యాపార నైపుణ్యం, అంతర్జాతీయ ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి సదస్సు మరింత తోడ్పడుతుందని అన్నారు. సదస్సులో పాల్గొంటున్న వారందరికీ సోనియా గాంధీ శుభాభినందనలు తెలిపారు.

## గ్లోబల్ సమ్మిట్ పూర్తిగా ఆర్థిక సదస్సు

- సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ రైజింగ్ 2047 దార్శనిక పత్రం, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ప్రజాభవన్‌లో వార్ రూమ్ ఏర్పాటు



**బలగం టీవీ, హైదరాబాద్**

డిసెంబర్ 8 నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పూర్తిగా ఆర్థిక సదస్సు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాబోయే 20 ఏళ్లలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి, అభివృద్ధి ప్రణాళికలను ప్రతిబింబించే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 దార్శనిక పత్రం, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన వార్ రూమ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమ్మిట్ కోసం భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న ఏర్పాట్లు, వరుసగా రెండు రోజుల కార్యక్రమాల ప్రణాళిక అంశాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారికి వివరించారు. విజన్ డాక్యుమెంట్‌కు తుది రూపు ఇచ్చే విషయంలో సీఎం గారు పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలకు విజన్ డాక్యుమెంట్‌లో ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఈ విజన్ డాక్యుమెంట్ డిజిటల్ రూపంలో పారదర్శకంగా, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలు, దాని ప్రాముఖ్యత, ప్రభుత్వ దార్శనికతను దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదికలో తెలియజెప్పేలా ఉండాలన్నారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే సదస్సు ఏర్పాట్లపై అధికారులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు ఇతర మంత్రులతో కలిసి శనివారం రోజున గ్లోబల్ సమ్మిట్ మినిట్ టూ మినిట్ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. దేశ వ్యాప్తంగా ఇండిగో తదితర విమానాలు రద్దవుతున్న పరిస్థితుల నేపథ్యంలో, సమ్మిట్‌కు హాజరయ్యే అతిథులకు సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు.

## పాన్ మసాలాపై కొత్త సెస్

- బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- ఈ సెస్ ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగిస్తాం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

వివరాలు 4వ పేజీలో



## రూ.4 కోట్ల 5 లక్షల హవాలా డబ్బు స్వాధీనం

- ఛేజ్ చేసి పట్టుకున్న బోయిన్‌పల్లి పోలీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

గుట్టు చప్పుడు కాకుండా ఓ కారులో హవాలా డబ్బు తరలిస్తున్నా ముఠాను నార్త్ జోన్ బోయిన్ పల్లి పోలీసులు ఛేజ్ చేసి పట్టుకున్నట్లు నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్ తెలిపారు. శుక్రవారం నార్త్‌జోన్ మిగితా 4వ పేజీలో

# ఎస్ఈసీ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి..

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్
- ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, ముస్తాబాద్ లోని రైతు వేదికలో శుక్రవారం ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హాజరై ఎన్నికల నిర్వహణ, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీపీటీ ప్రదర్శన ఇచ్చి ప్రతి అంశంపై వివరించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎస్ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, నీటి వసతి తదితర సదుపాయాలు తనిఖీ చేయాలని, సంబంధిత ఎంపీడీఓలు, అధికారులతో ఆ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. అనంతరం లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.

**నామినేషన్ కేంద్రంలో పరిశీలన**

ముస్తాబాద్ లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. హెల్ప్ డెస్క్, నామినేషన్లు పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. శిక్షణలో మండల ప్రత్యేక అధికారులు అఫ్జల్ బేగం, రాఘవేందర్, క్రాంతి, తహసీల్దార్లు సుజాత, రామచందర్, ఎంపీడీఓలు సత్తయ్య, లచ్చాలు, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# బస్సులో భారీ నగదు దొంగిలించిన నిందితుడు అరెస్ట్..




- రిమాండ్‌కు తరలింపు..
- రూ.3.92 లక్షలు స్వాధీనం..
- సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి.

**బలగం టీవీ, సిరిసిల్ల**

బస్సులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి వద్ద నుండి డబ్బులున్న బ్యాగ్‌ను దొంగిలించిన కేసులో నిందితుడిని సిరిసిల్ల పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి దొంగిలించబడిన రూ. 3,97,500 నగదులో రూ. 3,92,500/- నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి గురువారం విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. వేములవాడకు చెందిన నార్ల శ్రీనివాస్ అనే వ్యక్తి హెూల్‌సేల్ దుకాణాలకు చెల్లించాల్సిన రూ. 3,97,500 నగదును, అలాగే తన ఆధార్ కార్డు, పాన్ కార్డు, హెల్త్ కార్డు, ప్రెస్ అక్రిడేషన్ కార్డు, బస్ పాస్, రెండు చెక్కులు ఉన్న పర్సును క్యాష్ బ్యాగ్‌లో ఉంచుకున్నారు. డిసెంబర్ 3న ఉదయం 11:40 గంటలకు ఆయన ఈ బ్యాగ్‌తో వేములవాడ బస్టాండ్ వద్ద సిద్ధిపేట వెళ్లే బస్సు ఎక్కారు. శ్రీనివాస్ లాస్ట్ సీట్ కింద బ్యాగ్‌ను ఉంచి కూర్చున్నారు. కొద్దిసేపటి తర్వాత ఆయన ముందు సీటుకు మారి కూర్చున్నారు.

సుమారు 12:15 గంటలకు తంగళ్ళపల్లి వద్దకు చేరుకునే సరికి వెనుక సీటుకు వెళ్లి చూసుకోగా బ్యాగ్ కనిపించలేదు. కండక్టర్‌ను విచారించగా, సిరిసిల్ల వద్ద ఒక వ్యక్తి బస్సు దిగినట్టు తెలిపారు. దీంతో శ్రీనివాస్ సిరిసిల్ల పట్టణ పోలీసులను ఆశ్రయించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, వెంటనే రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వేములవాడ నుండి సిరిసిల్ల వరకు ఉన్న అన్ని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని వేములవాడ మండలం రుంద్రారం గ్రామానికి చెందిన బండారి బాలరాజు (తండ్రి: పర్శరాములు, వయస్సు: 50 సంవత్సరాలు) గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల విచారణలో నిందితుడు బాలరాజు తన నేరాన్ని ఒప్పుకున్నాడు. తాను వేములవాడలోనే సిద్ధిపేట బస్సులో ఎక్కి వెనుక సీటులో కూర్చున్నానని, ఫిర్యాది తన పక్కనే సీట్ కింద బ్యాగ్‌ను ఉంచడం గమనించానని తెలిపాడు. అవకాశం దొరికినప్పుడు బ్యాగ్‌లోని డబ్బులను దొంగతనం చేయాలని భావించి, సిద్ధిపేట్ టికెట్ తీసుకున్నప్పటికీ చంద్రంపేట్ వద్ద దిగానని ఒప్పుకున్నాడు. పోలీసులు నిందితుడి వద్ద నుండి మొత్తం నగదులో రూ. 3,92,500/- నగదును రికవరీ చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందని డీఎస్పీ తెలిపారు.

ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్రచారి ప్రయాణికులకు కొన్ని సూచనలు చేశారు. బస్సులలో ప్రయాణించేటప్పుడు చుట్టూ ప్రక్కల ఉన్న వారిని గమనిస్తూ ఉండాలని, విలువైన వస్తువులు, నగలు మరియు డబ్బులు ఉన్న బ్యాగులను వారి చేతిలోనే పట్టుకుని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అలాగే, ఇతరులు ఇచ్చే తినే వస్తువులు గాని, వాటర్ గాని తీసుకోకూడదని సూచించారు. ఈ కేసును చాకచక్యంగా చేధించిన పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, సిబ్బంది శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, రవికుమార్ లను డిఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఏసీబీ వలలో రూ. 100 కోట్ల అవినీతి 'తిమింగలం'..

**తప్పుడు సర్వే నెంబర్లతో ప్రభుత్వ భూములు కట్టబెట్టి**

**అక్రమాస్తులు కూడబెట్టిన రంగారెడ్డి ఏడీ శ్రీనివాసులు**

**బలగం టీవీ, హైదరాబాద్:**

రంగారెడ్డి జిల్లా సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పనిచేస్తున్న కొత్తమ్ శ్రీనివాసులు అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. తప్పుడు సర్వే నెంబర్లను ఉపయోగించి ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అక్రమంగా కట్టబెట్టి, ఏకంగా రూ. 100 కోట్ల విలువైన ఆస్తులు దండుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

సంపాదనకు మించిన ఆస్తులు కూడబెట్టారనే ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు శ్రీనివాసులు నివాసంతో పాటు ఆయన స్నేహితులు, బినామీల నివాసాలు, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు.



శ్రీనివాసులుకు మై హెూమ్ భూజలో ఒక విలాసవంతమైన ఫ్లాట్, అనంతపురంలో 11 ఎకరాల భూమి, కర్ణాటకలో 11 ఎకరాల భూమి, మహబూబ్‌నగర్ జిల్లాలో 4 ప్లాట్లు, నారాయణపేటలో ఒక రైస్ మిల్, 4 ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. తన ఇంట్లో సోదాలు చేస్తుండగా 1.6 కిలోల బంగారం, రూ.5 లక్షల నగదు, 770 గ్రాముల వెండి లభించినట్లు అధికారులు తెలిపారు. శ్రీనివాసులు మీద గతంలో కూడా ఏసీబీ కేసు నమోదు కావడంతో కొంతకాలం సస్పెన్షన్‌లో ఉండి తిరిగి విధుల్లో చేరినప్పటికీ, తన పద్ధతి మార్చుకోలేదని ఏసీబీ అధికారులు తెలిపారు. అక్రమాస్తులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని వారు వెల్లడించారు.



# దత్తాత్రేయ స్వామికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవల్లిలో దత్తాత్రేయ స్వామిని దర్శించుకొని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రాజరాజేశ్వర జలాశయం మధ్యమానేరులో స్పీడ్ బోట్ లో ప్రయాణం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దత్తాత్రేయ స్వామి జయంతి సందర్భంగా రాష్ట్రం మంచి వర్షాలతో ప్రజలందరూ ఆయు ఆరోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకుంటునాన్నని, మిడ్ మానేరు ప్రాజెక్ట్ రావడం వల్ల దత్తాత్రేయ స్వామి ఆలయం చుట్టూ నీరు వచ్చాయనీ,దత్తాత్రేయ జయంతి రోజు దర్శనం కోసం వచ్చే భక్తులకు బోట్లు ఏర్పాటు చేసమన్నారు.కేవలం జయంతి రోజు మాత్రమే కాకుండా శాశ్వతంగా బోటు ఏర్పాటు చేసేలా ఇరిగేషన్ వద్ద ఫైల్ పెండింగ్ లో ఉందన్నారు.దత్తాత్రేయ స్వామి ఆశీర్వచనం అందరిపై ఉండాలని, స్వామివారిని వేడుకున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజా పాలన ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని, భవిష్యత్? లో అనేక కార్యక్రమాలు చేపట్టడానికి ఆశీర్వచనం కావాలి, ప్రజాహితం కోరే వారందరికీ ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో చెప్తున్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి గ్రామాల్లో కూడా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. భక్తులందరికీ దత్తత్రేయా స్వామి జయంతి శుభాకాంక్షలు తెలుపుతూ, దత్తత్రెయా జయంతి సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశామని,స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి. గత మూడు రోజులుగా స్వామి వారిని భక్తులు దర్శించుకుంటున్నారని, ప్రభుత్వం తరుపున భక్తలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు.స్వామి వారి దర్శనం కోసం భక్తులకు బోటు సౌకర్యం ఏర్పాటు చేశామని, మన ప్రాంతంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు,దేవాదాయ శాఖ మంత్రుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 150 కోట్లతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ప్రజా సేవ కల నెరవేరకముందే కన్నుమూత..

**గుండెపోటుతో సర్పంచ్ అభ్యర్థి ఆకస్మిక మృతి!**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గుండె పోటుతో సర్పంచ్ మృతి చెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణా అర్ అండ్ కాలనీ లో చోటు చేసుకున్నది. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా చింతల్ ఠాణా అర్ అండ్ కాలనీ ఎస్సి జనరల్ కి రిజర్వ్ అవ్వగా బిఅర్ఎస్ పార్టీ మద్దతుతో చెర్ల మురళి(50) సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేయగా, ఎన్నికల అధికారులు గుర్తులు గుర్తింపు కేటాయింపులో భాగంగా మురళికి కత్తెర గుర్తు కేటాయించారు. గురువారం రాత్రి వరకు ప్రచారం నిర్వహించిన మురళి అర్ధరాత్రి గుండెపోటు కు గురై మృతి చెందారు. గ్రామాభివృద్ధికి మెరుగైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్న మురళి అర్ధాంతరంగా మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి..

# ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్

**బలగం టీవీ, నల్గొండ:**



నల్గొండ జిల్లా, గట్టుప్పల్ మండలం, తెరట్పల్లి గ్రామానికి చెందిన ఓ అక్రమ రిజిస్ట్రేషన్ విషయంలో సమాచారం కోరిన బాధితుల నుండి లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ గట్టుప్పల్ మండలం, తెరట్పల్లి గ్రామంలో జరిగిన ఓ అక్రమ రిజిస్ట్రేషన్ పట్ల వివరాలు కోరుతూ బాధితులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సమాచారం అందించేందుకు డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ వారిని రూ. 15 వేలు లంచం డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడానికి ఇష్టంలేని బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు.

హైదరాబాద్ నగరంలోని బాలాపూర్ ప్రాంతంలో ఉన్న తన నివాసంలో బాధితుల నుంచి రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా చంద్రశేఖర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి, అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు.



## ఎన్సీడీ కార్యక్రమం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి..

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ (NCD - అసంక్రమిత వ్యాధులు) కార్యక్రమం అమలుపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అధ్యక్షతన శుక్రవారం (5.12.2025) సిరిసిల్లలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్. సత్యేంద్రనాథ్ ముఖ్య వక్తగా పాల్గొని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎన్సీడీ స్టాఫ్ నర్సులకు మరియు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలోని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు కార్యక్రమం అమలు తీరును వివరించారు.

డాక్టర్ రజిత, డాక్టర్ సత్యేంద్రనాథ్ మాట్లాడుతూ.. ఎన్సీడీ కార్యక్రమం (మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు) కింద నమోదు చేసిన డేటాను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా ఆధార్‌తో లింక్ చేయాలి. నమోదు ప్రక్రియలో భాగంగా ఆభా కార్డులను ఆన్‌లైన్‌లో జనరేట్ చేయాలి. ఎన్సీడీ కార్యక్రమంలో నమోదు చేసిన వారికి సకాలంలో చికిత్స అందించి, గ్రామంలోని ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి. కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ఎన్సీడీ డేటా కార్యక్రమానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ అనిత, డాక్టర్ నయీమా, డిడియం కార్తీక్ పాల్గొన్నారు.



## పని ప్రదేశంలో లైంగిక వేధింపులు జరగకుండా చూడాలి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి పని ప్రదేశంలో ఇంటర్నల్ కమిటీ అంతర్గత కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ అధికారి పీ.లక్ష్మీరాజ్యం సూచించారు. శుక్రవారం అపరెల్ పార్కులోని పంక్చుయేట్ వరల్డ్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులతో సమావేశం కావడం జరిగింది.ఈ సందర్భంగా కంపెనీ ఆవరణలో అంతర్గత కమిటీ పనితీరును పరిశీలించారు. కార్మికులతో మాట్లాడివారికి అందుతున్న ప్రయోజనాలు, పని ప్రదేశంలో స్థితిగతుల గురించి పరిశీలించారు. అలాగే మేనేజ్మెంట్ సభ్యులతో మాట్లాడి ప్రతి ఒక్కరి హక్కులను కాపాడాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక వాతావరణంలో పని ప్రదేశం ఉండాలని సూచించారు. పని ప్రదేశంలో సరైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు మానసిక ఉల్లాసానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే క్రచ్ పిల్లల డేకేర్ సెంటర్ లో పిల్లలకి అందుతున్న సేవలను పరిశీలించడం జరిగింది.



## గ్రామపంచాయతీ ఎన్నికల కొరకై శిక్షణ కార్యక్రమం..

**బలగం టీవీ, బోయినిపల్లి:**

05.12.2025 రోజున మధ్యాహ్నం 2.00.గంటలకు, సెకండ్ ఆర్డినరి ఎన్నికలు 2025వ గ్రామ పంచాయతి ఎన్నికలకు స్టేజి 2 ఆర్.ఓ.ఎస్ 23 మరియు పి.ఓ.ఎస్108లకు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక రైతు వేదిక నందు టి.ఓ.టి శ్రీనివాస్ రెడ్డితో ట్రైనింగ్ ఇవ్వనైనది. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్ సీ.ఈ.ఓ జెడ్. పి, మండల స్పెషల్ ఆఫీసర్ శరత్ బాబు, మండల అభివృద్ధి అధికారి బి.జయశీల మండల అభివృద్ధి అధికారి, మండల తహశీల్దార్ నారాయణ రెడ్డి మరియు ఆర్.ఓ.ఎస్ మరియు పి.ఓ.ఎస్ లు హాజరు అయ్యారు.

# చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలి

- క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి
- ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలి..
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- కేంద్రీయ విద్యాలయం వార్షిక ఆటల పోటీలు ప్రారంభం
- అలరించిన విద్యార్థుల నృత్యాలు, ప్రదర్శనలు..







**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

విద్యార్థులు చదువుతోపాటు ఆటలోనూ రాణించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. కేంద్రీయ విద్యాలయం వార్షిక ఆటల పోటీలు 2025- 26 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరు కాగా, స్కౌట్స్ అండ్ గైడ్స్ స్వాగతం పలికారు. ఆటల పోటీల జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. విద్యార్థుల నృత్యాలు, ప్రదర్శనలు అలరించాయి.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలని పిలుపు ఇచ్చారు. విద్యార్థులు ఆన్లైన్ గేమ్స్ ఆడవద్దని, ప్రతి రోజు గంట పాటు ఆటలు ఆడాలని సూచించారు. క్రీడలు, యోగా సాధనతో శారీరక, మానసిక సమతుల్యత, అభివృద్ధి సాధ్యమని వివరించారు. తరగతి గది పుస్తకాలతోపాటు లైబ్రరీ లోని ఇష్టమైన పుస్తకాలు, దిన పత్రికలు చదవాలని పేర్కొన్నారు. వివిధ అంశాలపై అవగాహన వస్తుందని వివరించారు. గత ప్రశ్నాపత్రాలు, మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలని సూచించారు. దీంతో వార్షిక, పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులువు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శేషా ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లారీలు అందుబాటులో ఉండాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీల కాంట్రాక్టర్లతో సమావేశం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలకు అనుగుణంగా లారీలు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. బోయినపల్లి, కోనరావుపేట మండలాలకు చెందిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీల కాంట్రాక్టర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు, నిలువుల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన వెంట వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం తరలించేందుకు లారీల కొరత లేకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్ర ప్రకాశ్, డీఎం రజిత, డీసీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించిన అదనపు కలెక్టర్..**

వేములవాడ అర్బన్ మండలంలోని నాంపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీ ఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం నిలువలు చూసి, అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ వేగంగా పూర్తి చేసి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు.

**నామినేషన్ల పరిశీలన**

ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు నామినేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ లో భాగంగా ఎల్లారెడ్డిపేట, హరిదాస్ నగర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో వేములవాడ, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్లు విజయ ప్రకాశ్ రావు, సుజాత తదితరులు ఉన్నారు.



# విద్యార్థులతో కలిసి మొక్క నాటిన విద్యార్థి కన్నం శ్రేయాస్



**బలగం టీవీ, బోయినిపల్లి:**

మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో బాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని ఆనంద్ విద్యా నికేతన్ స్కూల్ ఆవరణలో స్కూల్ టీచర్స్ మరియు తన సహచర విద్యార్థులతో కలిసి మొక్క నాటిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కన్నం సాగర్-వర్షితల కుమారుడు శ్రేయాస్.

ఈ సందర్భంగా కన్నం సాగర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని, మా అబ్బాయితో మొక్క నటించడం జరిగింది.భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ దాసరి జగన్, అలువాల అజయ్ మరియు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉస్మానియా అభివృద్ధిలో

# విద్యార్థులు, సిబ్బంది అభిప్రాయాలకు ప్రాధాన్యం



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఓయూ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉస్మానియా యూనివర్సిటీలో చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో విద్యార్థులు, బోధన సిబ్బంది అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఓయూ అభివృద్ధి పనులకు సంబంధించి ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు వెనుకాడమని తెలిపారు.

ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. యూనివర్సిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తొలుత అధికారులు వివరించారు. అనంతరం పనులకు సంబంధించిన వివిధ మోడళ్ల పవర్ పాయింట్ ప్రజంటేషన్స్‌ను ముఖ్యమంత్రి వీక్షించారు. హాస్టల్ భవనాలు, రహదారులు, అకడమిక్ బ్లాక్స్, ఆడిటోరియం నిర్మాణాలకు సంబంధించి పలు మార్పులు చేర్పులను సూచించారు. యూనివర్సిటీ పరిధిలోని అటవీ ప్రాంతంలో పనులకు అర్బన్ ఫారెస్ట్రీ నిధులు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికే ఉన్న జల వనరులను సంరక్షిస్తూనే నూతన జల వనరుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. హాస్టల్, అకడమిక్ భవనాల నిర్మాణం విషయంలో వంద మంది విద్యార్థులుంటే అదనంగా మరో పది శాతం విద్యార్థులకు వసతులు ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది భవిష్యత్తులోనూ ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. యూనివర్సిటీ పరిధిలోని చారిత్రక, వారసత్వ భవనాలను సంరక్షించాలని చెప్పారు. చారిత్రక ప్రాధాన్యం లేని పురాతన భవనాలకు భారీ మొత్తాలు వెచ్చించి మరమ్మతులు చేసే బదులు నూతన భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సైకిల్ ట్రాక్‌లు, వాకింగ్ పాత్‌లతో పాటు ప్రతి పనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ఉస్మానియా విద్యార్థుల పోరాట ప్రతిమను ప్రతిబింబించే చిహ్నాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ నెల 10 ఓయూను సందర్శించనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ప్రధానంగా అకడమిక్ బ్లాక్‌లు, హాస్టళ్లను పరిశీలిస్తానని చెప్పారు. యూనివర్సిటీ అభివృద్ధి పనుల విషయంలో విద్యార్థులు, బోధనా సిబ్బంది అభిప్రాయాలు స్వీకరించాలని పేర్కొన్నారు. తొలుత అభివృద్ధి నమూనాలు వారి ముందు ఉంచాలని.. తర్వాత వారి అభిప్రాయాలు తెలిపేందుకు డ్రాప్ బాక్స్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. వారి అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తూ ఈ నెలాఖరు నాటికి అభివృద్ధి ప్రణాళికలపై తుది నిర్ణయం ఖరారు కావాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఓయూ వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ మొలుగురం కుమార్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం లతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా

(మొదటి పేజీ తరువాయి)

పథకాలు అమలు చేస్తున్నాం.ఇంటి ఆడబిడ్డకు చీరె పెట్టడం ఒక సంప్రదాయం. ఇంట్లో సొంత సోదరుడి తరహాలో ప్రతి ఏటా సారె పండుగ చేసుకోవాలని గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది ఆడబిడ్డలకు చీర అందిస్తున్నాం. రాష్ట్రంలో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఆడబిడ్డకు చీరె చేరాలి. రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ కూడా నాకు చీర రాలేదని అనొద్దు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయ్యాక, మార్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ, మున్సిపాలిటీల్లో చీరె అందజేస్తాం.

ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోంది. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డులు ఉండగా, 3.10 కోట్ల మంది బిడ్డలకు సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రభుత్వంపై 13 వేల కోట్ల రూపాయల భారం అవుతున్నా పేదవారి ఆకలి తీర్చాలని, వారు కడుపునిండా భోజనం చేయాలని సన్నబియ్యం ఇస్తున్నాం. పేదవారి ఆత్మగౌరవం పెరగాలన్న లక్ష్యంతో వారికి ఇందిరమ్మ ఇండ్లు ఉండాలని, ఆర్థికంగా భారమైనప్పటికీ ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల పనులు మొదలయ్యాయి…" అని సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను ముఖ్యమంత్రి గారు వివరించారు.

### బీఆర్ఎస్ పాలనలో

# స్వయం సమృద్ధి కేంద్రాలుగా గ్రామాలు

(మొదటి పేజీ తరువాయి)

సహకారం, పల్లె ప్రగతికి కేసీఆర్ ప్రభుత్వం క్రమం తప్పకుండా విడుదల చేసిన నిధులు, గొల్ల కురుమ, ముదిరాజ్, బెస్త, గౌడ, పద్మశాలి సహా చాకలి, మంగలి సబ్బండ కుల వృత్తులకు, దళిత, బహుజన, గిరిజన మహిళల కోసం ప్రత్యేకంగా అమలుచేసిన పథకాలు, అందించిన ఆర్థికసాయం గురించి చర్చిస్తూ స్మరించుకున్నారు.క్రమం తప్పకుండా ఆసరా సహా సకల రకాల పింఛన్లు అందిన ఆర్థిక సహకారంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎంత గొప్పగా పరిఢ విల్లిందో చర్చ జరిగింది.

ఈ సందర్భంగా సమావేశంలో ఉన్న ఒక గ్రామస్థుడు మాట్లాడుతూ.. "సార్ తమరి హయాం మా పల్లెలకు సువర్ణ యుగం.. ఇప్పుడేముంది సార్.. గోస మిగిలింది. అన్ని కులాలు అరిగోస పడుతున్నయి. ఏదైనా పోగొట్టుకున్నంకనే అర్థమైతది.. సార్. మీరు వున్నప్పుడు తెల్వలె మీ విలువ, ఇప్పుడు అర్థమైతాంది. మల్ల మీరొస్తే తప్ప తెలంగాణ పల్లెలకు మునుపటి కళ రాదు. మల్ల మీరే రావాలే. వస్తరు. కాంగ్రెస్ ప్రభుత్వంల ఇగ మాగ్గూడ రెండేండ్లకే సరిపోయింది సార్" అని అన్నారు. కాగా ఆయన వివరించినప్పుడు బాధతో పాటు నవ్వులు విరిసాయి. అందుకు సమాధానంగా మాట్లాడిన కేసీఆర్ వారికి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. "మనకు అన్ని కాలాలు అనుకూలంగా వుండయి. కొన్నికొన్ని సమయాలు కష్టాలు వస్తయి. వాటికి వెరవకూడదు. మల్లా మన ప్రభుత్వమే వస్తది. తెలంగాణ పల్లెలకు తిరిగి మంచిరోజులు వస్తయి. అప్పుడిదాకా ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడొద్దు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు నడవాలె" అని కేసీఆర్ గారు గ్రామస్థులకు వివరించారు.

"ఇప్పుడు నూతనంగా ఎన్నికైతున్న సర్పంచులు గొప్ప ఆలోచనలతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు రచించుకోవాలి. గంగదేవిపల్లి లాంటి అభివృద్ధి చెందిన స్వయం సహాయక గ్రామాలను ఆదర్శంగా తీసుకొని, ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు వేసుకొని, మన పని మనం చేసుకుంటూ మన పల్లె అభివృద్ధికి పాటుపడాలి. ఎవరో ఏదో చేస్తారని, ఏదో ఇస్తారని ఆశలు పెట్టుకొని ఆగం కావద్దు" అని కేసీఆర్ తెలిపారు.ఈ సందర్భంగా వారికి జాతీయ, అంతర్జాతీయంగా పల్లెల ప్రగతి కోసం గొప్ప వ్యక్తులు చేసిన కృషి గురించి కేసీఆర్ గారు వివరించారు.బంగ్లాదేశ్ కు చెందిన సామాజిక ఆర్థికవేత్త, స్వయం సహాయక బృందాల ఏర్పాటుకు స్ఫూర్తి దాత, ప్రొఫెసర్ యూనిస్ తో పాటు మన దేశానికే చెందిన అన్నా హజారే లాంటి దార్శనికుల గురించి వారి కృషిని వివరించారు.

వారిని ఆదర్శంగా తీసుకుని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో తమ పల్లెలను సామాజిక ఆర్థిక స్వయం సమృద్ధి కేంద్రాలుగా తీర్చి దిద్దుకోవాలి అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎర్రవెల్లి గ్రామ సర్పంచి, నారన్నగారి కవితా రామ్మోహన్ రెడ్డి దంపతులు, గ్రామ ఉప సర్పంచ్ ఎద్మ సబితా కరుణాకర్, వార్డు మెంబర్లు, నర్సన్నపేట గ్రామ సర్పంచ్ గిలక బాల నర్సయ్య, ఇరు గ్రామాలకు చెందిన ప్రముఖులు సమావేశంలో హాజరయ్యారు. వారిని కేసీఆర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నేత మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# పాన్ మసాలాపై కొత్త సెస్

- బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్**



పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్ విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. శుక్రవారం లోక్‌సభలో హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ఈ సెస్ ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగిస్తామన్నారు. అలాగే ఆ నిధులను రాష్ట్రాలకు ఇస్తామని తెలిపారు. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లకు సెస్ విధిస్తామని అన్నారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జీఎస్టీలో గరిష్ట శ్లాబు 40 శాతం విధిస్తున్నట్లు తెలిపారు. సెస్ వల్ల జీఎస్టీ రెవెన్యూపై ఎలాంటి ప్రభావం ఉండదని అన్నారు. తయారీ సామర్థ్యం ఆధారంగా ఈ సెస్ విధించనున్నట్లు తెలిపారు. 2010–2014 మధ్య సెస్ రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 7 శాతంగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం 6.1 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. అనంతరం ఈ బిల్లును ముజూవాణి ఓటుతో లోక్‌సభ ఆమోదించింది.

### 2030 ఆర్థిక సహకార కార్యాచరణకు

# భారత్-రష్యా అంగీకారం

(మొదటి పేజీ తరువాయి)

పుతిన్ అన్నారు.

**ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు భారత్ మద్దతు**

ఉగ్రవాదానికి వ్యతిరేక పోరాటంలో భారత్-రష్యాలు చాలా కాలంగా కలిసి పనిచేస్తున్నాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. పహల్గాం దాడి నుంచి క్రోకస్ సిటీ హాల్‌పై దాడి వరకు ఉగ్రవాదం మానవత్వానికి శత్రువని చెప్పారు. ఉక్రెయిన్%-%రష్యా యుద్ధం ముగింపునకు జరుగుతున్న అంతర్జాతీయ ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని, శాంతియుత పరిష్కారం కోసం భారత్ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

**భారత్ ఆర్థిక వ్యవస్థకు రష్యా అండ: మోదీ**

భారత వాణిజ్యానికి రష్యా ఎప్పటికప్పుడు అండగా నిలుస్తోందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. యూరియా ఉత్పత్తి రంగానికి రష్యా అందిస్తున్న మద్దతును ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇరుదేశాల మధ్య 2030 ఆర్థిక ప్రణాళికపై ఒప్పందం కుదిరిందని తెలిపారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరిందని, దీన్ని త్వరలో అమలు చేసే దిశగా ఇరుపక్షాలు ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు.

# రూ.4 కోట్ల 5 లక్షల హవాలా డబ్బు స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

డీసీపీ కార్యాలయంలో వివరాలను ఆమె వెల్లడించారు. గతంలో ఓ చీటింగ్(50 లక్షల) కేసు బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ నమోదు కాగా ఆ విచారణలో భాగంగా దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆ కేసులో నిందితులను ట్రేస్ చేస్తుండగా హవాలా డబ్బులు తరలిస్తున్న ముఠా గురించి తెలిసింది. ఈ సమాచారం మేరకు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుల కోసం బోయిన్‌పల్లి పోలీసులు కాపు కాశారు. ఈ క్రమంలో నిందితులు పోలీసులను చూసి పారిపోతుండగా వారి వాహనాలను పోలీసులు ఛేజ్ చేశారు. మహబూబ్‌నగర్ అడ్డాకుల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టోల్‌గేట్ వద్ద నిందితులను పట్టుకొని రూ.4 కోట్ల 5 లక్షలను సీజ్ చేశారు. నిందితులు ప్రకాష్ మోతిబాయ్ ప్రజాపతి, ప్రగ్నేష్ కీర్తి భాయ్ ప్రజాపతిలను అరెస్టు చేసినట్టు డీసీపీ తెలిపారు. ఎంహెచ్ 49 సీఎల్ 2496 హెూండా క్రెటా అనే కారు సీట్ భాగంలో ఓ బాక్స్‌లను తయారు చేసి అందులో హవాలా డబ్బును వారు తరలిస్తున్నట్టు చెప్పారు. సీజ్ చేసిన డబ్బులను సంబంధిత ఐటి అధికారులకు అప్పగిస్తామని ఆమె తెలిపారు

# జపాన్‌లో ప్రభాస్ సందడి

- కొత్త లుక్‌తో అభిమానులకు సర్ప్రైజ్

**బలగం టీవీ, హైదరాబాద్**



పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో తన క్రేజ్‌ను చాటుకున్నాడు. జపాన్‌లో నిర్వహించిన 'బాహుబలి: ది ఎపిక్' ప్రత్యేక ప్రదర్శనకు హాజరైన ప్రభాస్, అక్కడ అభిమానులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా తీసిన ఫోటోలు, వీడియోలు జపాన్‌తో పాటు భారతీయ సోషల్ మీడియాలో దుమ్మురేపుతున్నాయి. ప్రభాస్ కనిపించిన కొత్త స్టైలిష్ లుక్ అభిమానులను ఆశ్చర్యపరిచింది. ఇప్పటివరకు చూడని గెటప్‌తో కనిపించిన ఆయనను చూసి "ఇది స్పిరిట్ మూవీ లుక్ అయి ఉంటుందేమో" అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

జపాన్ సోషల్ ప్లాట్‌ఫార్మ్‌లలో ప్రభాస్‌తో జపాన్ ఫ్యాన్స్ చేసిన మాటామంతి వీడియోలు విపరీతంగా వైరల్ అవుతుండటంతో, మరోసారి 'బాహుబలి మేనియా' అక్కడ కనిపిస్తోంది. ఇటీవల 'బాహుబలి ది ఎపిక్' ఇండియాలో విడుదలై మంచి స్పందన పొందింది. రెండు పార్ట్‌లను ఒకే కథగా కూర్చిన ఈ వెర్షన్‌కు ప్రేక్షకుల నుంచి మంచి మాటలు వచ్చాయి. ఇక ప్రభాస్ ప్రస్తుతం రెండు భారీ పాన్-ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నాడు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' షఉటింగ్ శర వేగంగా కొనసాగుతోంది. ఆర్మీ నేపథ్య కథతో వస్తున్న ఈ చిత్రానికి ప్రభాస్ ప్రత్యేక లుక్ కోసం ట్రాన్స్‌ఫర్మేషన్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది.